
భిక్షకుని మాయాజాలం

చైనా జానపద కథ



భిక్షుకుని మాయాజాలం

చైనా జానపద కథ



భిక్షకుని మాయాజాలం

చైనా జానపద కథ





చైనాలో చాలా ఏళ్ల క్రితం నాటి సంగతి. ఒక రోజు ఒక ఊరికి ఒక అపరిచితుడు వచ్చాడు. ఊరి చివర అమ్మా, నాన్నలతో ఉంటున్న ఫు నాన్ ముందుగా ఆ అపరిచితుడిని చూశాడు. కథలలో విన్న సంచార సాధువు లాగా అతడు ఫు నాన్‌కి అనిపించాడు – మాయాజాలం తెలిసిన సాధువు. అతడు అనుకోకుండా కనపడటంతో ఫు నాన్ ముందు భయపడ్డాడు. అయితే సాధువు ముఖం శాంతంగా, దయగా ఉంది. ఫు నాన్ అతడికి గౌరవంగా నమస్కరించాడు.

“కొంత కాలం ఉండటానికి ఈ ప్రదేశం బాగుంది,” ఆ ముసలి సాధువు అన్నాడు. “నేను ఉండటానికి ఏదైనా చోటు చూపించగలవా?”

ఊరు బయట ఎవరూ ఉండని ఒక పాత గుడిసెను ఫు నాన్ చూపించాడు. అతడు గడ్డితో పక్క చేసుకున్నాడు. పెద్ద అక్షరాలతో రాసి ఉన్న కాగితాన్ని గోడకి తగిలించాడు. ఈ గుడిసె తన మఠం అని చెప్పాడు. అతను ఎప్పుడు నిద్ర లేస్తాడా అని ప్రతి ఉదయం ఫు నాన్, అతడి స్నేహితులు ఆ గుడిసె కిటికీ గుండా తొంగి చూసేవాళ్లు.

ముసలివాడు అడుక్కోటానికి ఊళ్లోకి వెళ్లినప్పుడు అతడి వెంట తిరగటం పిల్లలకు సరదాగా ఉండేది. అతడు ఎప్పుడూ నవ్వుతూ ఉండేవాడు. వాతావరణం ఎలా ఉన్నా పట్టించుకునేవాడు కాదు – అవే చిరిగిన బట్టలు, పాత చెప్పులు వేసుకునేవాడు. సాధువులు కావాలని పేదరికాన్ని ఎంచుకుంటారని తెలిసిన ఊరివాళ్లు అతడికి అన్నం, కూరలు సంతోషంగా పెట్టేవాళ్లు.

ధనికుడు, పిసినారి అయిన రైతు ఉ ఇంటికి మాత్రం వెళ్లవద్దని సాదువుకి ఫు నాన్ చెప్పాడు, ‘‘అతడి ఇంటికి వెళ్లిన బిచ్చగాడి మీదకి కుక్కలను ఉసిగొల్పుతాడు.’’


ముసలి సాధువు వెంట ఎప్పుడూ ఉండటం వల్ల అతడి వద్ద అసాధారణ శక్తులు ఉన్నాయని ముందుగా పిల్లలకే తెలిసింది.




ఒక రోజు ఉదయం తన గుడిసె వద్ద పిల్లలను పలకరించినప్పుడు బుట్టలు అల్లేవాళ్ల కొడుకు చేతిలోని పంజరంలో ఒక పిచ్చుకను సాధువు చూశాడు. అది తప్పించుకోటానికి ఎగురుతూ పంజరానికి కొట్టుకుంటోంది.

“నీకు ఇంద్రజాలం చూపిస్తే ఈ పిట్టని వదిలి పెట్టేస్తావా?” అని ముసలి సాధువు అడిగాడు.

కళ్లు పెద్దవి చేస్తూ ఆ పిల్లవాడు తల ఊపి తన అంగీకారాన్ని తెలియచేశాడు. ముసలివాడు గుడిసెలోకి వెళ్లి ఒక నల్ల గుడ్డ, రంగు బిళ్ల, కాగితం, కుంచె తెచ్చాడు. నల్ల గుడ్డతో పంజరాన్ని కప్పేశాడు. రంగు బిళ్లకి నీళ్లు కలుపుతుంటే పిల్లలందరూ నిశ్శబ్దంగా చూస్తూ ఉన్నారు. కుంచెతో ఇలా, అలా గీసి పంజరంలోని పక్షి బొమ్మ గీశాడు. అది ప్రాణమున్న పక్షి లాగా, ఏ క్షణమైనా పాడే లాగా అనిపిస్తోంది. పంజరం తలుపు తెరుచుకుని ఉన్నట్టు వేసి చిత్రాన్ని సాధువు పూర్తి చేశాడు.





అప్పుడు బొమ్మలోని పక్షి రెక్కలు ఆడించింది. తెరిచి ఉన్న తలుపులోంచి ఎగిరి, కాగితాన్ని ముక్కుతో కరుచుకుని దగ్గరలోని చెట్టు మీద వాలింది. బుట్టలు అల్లేవాళ్ల పిల్లవాడు పంజరం మీద నుంచి నల్ల గుడ్డని లాగేశాడు. ఫు నాన్, మిగిలిన పిల్లలు ఆశ్చర్యంతో అరిచారు. పంజరం ఖాళీగా ఉంది.

పిల్లవాడిని చూసి సన్యాసి చిరునవ్వు నవ్వాడు. "నువ్వు ఒక మంచి పని చేశావు," అతడు అన్నాడు. "ఒక జీవికి స్వతంత్రంగా, దాని ఇచ్ఛానుసారం ఎగిరే అవకాశం ఇచ్చావు."

ఆ తరవాత ఒక రోజు, "ఆ మాయాజాలం నాకు కూడా నేర్పిస్తావా?" అని సాదువుని ఫు నాన్ అడిగాడు.

"ఈ మాయాజాలం నేర్చుకోటానికి ముందు నేను సాధువుని కావటానికి అన్నింటిని వదిలి పెట్టాను. తరవాత ఎన్నో సంవత్సరాల పాటు చదివాను. అంతేకాకుండా, నా స్వార్థానికి మాయాజాలాన్ని ఉపయోగించనని మాట ఇచ్చాను. నువ్వు ఇంకా చిన్న పిల్లవాడివి. నీ దారి ఏమిటో తెలియటానికి ఇంకా కొంత కాలం ఎదురు చూడు," అని ప్రేమగా బదులిచ్చాడు.



ముసలి విధవరాలు లియాంగ్ ఇంటిలో బావి ఎండిపోయింది. ఊరి బావి నుంచి ఆమె ఇంటికి బక్కెట్టుతో నీళ్లు తీసుకురావటంలో అప్పుడప్పుడు ఫు నాన్ ఆమెకు సహాయం చేసేవాడు.

ఒక వేసవి రోజున, “నీ బావి ఎప్పుడు ఎండిపోయింది?” అని లియాంగ్‌ని సాధువు అడగటం ఫు నాన్ విన్నాడు.

“నా బావికి నీళ్లు తెచ్చే కాలవని రైతు ఉ సంవత్సరం క్రితం తన సీమ రేగు తోటకి మళ్లించినప్పటి నుంచి,” అని లియాంగ్ బదులు ఇచ్చింది.

“నీకు సహాయం చెయ్యగలనని అనుకుంటున్నాను,” అన్నాడు సాధువు. ఒక గిన్నెడు నీళ్లను లియాంగ్ బావిలో పోశాడు. మరునాడు ఉదయం ఆమె బావి నిండా తియ్యటి నీళ్లు ఉన్నాయి.

ఫు నాన్, లియాంగ్ మాత్రమే ఈ మాయాజాలాన్ని చూశారు. అయితే కొన్నాళ్లకి ఈ విషయం ఊరు మొత్తానికి తెలిసింది.

ఆగస్టు నెలలో పౌర్ణమి పండగ నాడు బజారుకు వెళ్లే దారులు సరుకులు తీసుకుని వెళ్లే రైతులు, వ్యాపారస్తులతో నిండిపోయాయి. క్యాబేజి మూటలను వీపు మీద మోస్తున్న అమ్మా, నాన్నలతో కలిసి ఫు నాన్ కూడా వెళుతున్నాడు. అతడు ముసలి సాధువుని చూసి అతని తోపాటు బజారుకి వస్తానని వాళ్లకి చెప్పాడు.

తన పుట్టిన రోజుకి ఇచ్చిన డబ్బులతో కొనుక్కోబోయే గాలిపటం గురించి సాధువుకి ఫు నాన్ చెప్పసాగాడు. ఉన్నట్టుండి వాళ్ల వెనక కలకలం మొదలయ్యింది. వేగంగా వస్తున్న రైతు ఉ గాడిదను చూసి అందరూ కకావికలై పక్కకి తప్పుకున్నారు. ఎంతో బరువు లాగుతున్న ఆ గాడిదను ఇంకా వేగంగా పరిగెత్తించటానికి రైతు ఉ దానిని కొడుతూ, అరుస్తూ ఉన్నాడు.






ఫు నాన్, ముసలి సన్యాసి బజారుకి చేరుకునే సరికి రైతు ఉ తన పళ్ల అమ్మకం మొదలు పెట్టాడు. సీమ రేగు పళ్లు తియ్యగా ఉండటంతో అందరూ వాటిని కొనుక్కుంటున్నారు. రైతు ఉ వాటికి చాలా ఎక్కువ ధర చెబుతున్నాడు.

"ఒక పండు నాకు ఇవ్వవా?" అని సన్యాసి అడిగాడు. "ఫో, ఫో, బిచ్చగాడా! నీకు ఇక్కడ ఏమీ దొరకదు," రైతు ఉ అరిచాడు. "నీ దగ్గర చాలా పళ్లు ఉన్నాయి," మసలి సాధువు అన్నాడు. "ఒక్కటి కూడా ఇవ్వలేవా?"

అక్కడ చాలామంది గుమిగూడారు. "ఇంత పిసినారితనం పనికిరాదు! ముసలివానికి ఒక పండు ఇవ్వు!" అని ఎవరో అన్నారు. కాని రైతు ఉ కోపంగా తన కర్ర తిప్పుతూ సాధువుని నానా మాటలు అన్నాడు. కొత్త గాలిపటం కొనుక్కోవాలన్న కోరికను దిగమింగుకుని లాగు జేబులో ఫు నాన్ చెయ్యి పెట్టాడు. గాలిపటం తరవాత కొనుక్కోవచ్చు అని నచ్చ చెప్పుకుని తన దగ్గర ఉన్న డబ్బులు రైతు ఉ కి ఇచ్చేశాడు.




తన పుట్టిన రోజుకి వచ్చిన మొత్తం డబ్బులకి ఒక్క చిన్న సీమ రేగు పండు మాత్రమే వచ్చింది. కొత్త గాలిపటం పట్ల తన కోరిక కనపడకుండా ఉండటానికి ఫు నాన్ నేలకేసి చూస్తూ ఆ పండుని సాధువుకి ఇచ్చాడు.

వంగి ధన్యవాదాలు చెప్పిన తరవాత, తన చుట్టు పక్కల ఉన్న వాళ్లతో ముసలి సాధువు ఇలా అన్నాడు, "మీరందరూ నాకు ఇన్నాళ్లూ అన్నం పెట్టారు. ఈ రోజు నేను మీకు తియ్యని సీమ రేగు పండు ఇస్తాను." అతడు మెల్లగా సంత బజారు దాటి ముందుకు వెళ్లాడు. అక్కడి వాళ్లందరూ గుంపుగా అతడిని అనుసరించారు. మిగిలిన వాళ్ల లాగానే రైతు ఉ కూడా కుతూహలంతో వాళ్ల వెంట వెళ్లాడు.

ఒక ఖాళీ ప్రదేశం వద్ద సాధువు ఆగాడు. చిన్న సీమ రేగు పండుని కొరికి తినేశాడు. చివరికి చిన్న విత్తనం మిగిలింది.

వీపుకి ఉన్న ఒక సంచి నుంచి సాధువు ఒక పార బయటకి తీశాడు. దాంతో అతడు నేలను తవ్వి ఒక పాదు చేశాడు. దాంట్లో సీమ రేగు పండు గింజ నాటాడు. “ఫు నాన్. ఒక గిన్నెలో మరుగుతున్న నీళ్లు తీసుకుని రా,” అంటూ పురమాయించాడు.

దగ్గరలోని టీ దుకాణం నుంచి మరుగుతున్న నీళ్లని ఫు నాన్ తెచ్చాడు. ఆ వేడి నీళ్లను ముసలి సాధువు పాదులో పోశాడు. ఆ వెంటనే ఒక పచ్చని మొలక నేల లోంచి బయటకు వచ్చింది. చూస్తుండగానే ఆ మొక్క ఆకులు, కొమ్మలతో చెట్టుగా మారింది. దాని పూలకు ఆకర్షితమయ్యి తేనెటీగలు, సీతాకోక చిలకలు వచ్చాయి. కొమ్మల్లో పిట్టలు పాటలు పాడసాగాయి.





పూలు పిందలు అయ్యాయి, చూస్తుండగానే పిందలు పెద్దవి అయ్యి పెద్ద పెద్ద పండ్లు అయ్యాయి. ముసలివాడు ఒక పండుని వాసన చూసి, ‘‘ఇవి తినటానికి తయారుగా ఉన్నాయి,’’ అన్నాడు. అతడు పళ్లను తెంచి అందరికి తలా ఒకటి ఇచ్చాడు. అన్నింటికంటే పెద్ద, తియ్యటి సీమ రేగు పండు అతడు విధవరాలు లియాంగ్‌కి ఇచ్చాడు.


‘‘తియ్యగా ఉంది! బాగుంది! అద్భుతం!’’ సన్యాసి మాయాజాలానికి ప్రజలు అబ్బుర పోయారు.

చివరి పండు కోశాడో, లేదో చెట్టు ఆకులు పండుబారిపోయి, రాలిపోసాగాయి. ఆరోగ్యంగా ఉన్నాయనుకున్న కొమ్మలు ఎండిపోసాగాయి.

“చెట్టు తన కాయలన్నింటిని ఇచ్చేసింది,” ముసలి సాధువు అన్నాడు. తన గొడ్డలితో ఆ చెట్టుని నరికేశాడు. వంట కోసం ఆ కట్టెలను ఊరి ప్రజలకు ఇచ్చేశాడు.

అతడు చేతులకు అంటిన దుమ్ము దులుపుకుని సంచిలో వెతికి ఒక కాగితం ముక్క తీశాడు. దానిని అతడు ఫు నాన్‌కి ఇచ్చాడు. “ఇంటికి చేరుకున్న తరవాత దీనికి దారం కట్టి ఏమవుతుందో చూడు,” అంటూ గుసగుసగా చెప్పాడు.


చెయ్యి ఊపి అందరికి వీడ్కోలు పలికాడు. తరవాత కొండకి వెళ్లే దారి పట్టాడు.



అందరూ గుంపులుగా చేరి సాధువు చేసిన మాయాజాలం గురించి మాట్లాడుకుంటున్నారు. కాగితం ముక్కని ఫు నాన్ తన జేబులో పెట్టుకుని అమ్మా, నాన్నల కోసం చూడసాగాడు.

బజారు లోంచి కోపంతో కూడిన కేక వినపడటంతో ఫు నాన్ ఆగిపోయాడు. అతడి బండి ఉండ వలసిన చోట రైతు ఉ ఉన్నాడు. కాని అతడి పండ్లు, బండి మాయం అయ్యాయి. అక్కడ గాడిద, బండి చక్రాలు మాత్రమే ఉన్నాయి.

ఫు నాన్‌కి వెంటనే అంతా అర్థమయ్యింది. ముసలి సాధువు తన మాయాజాలంతో రైతు ఉ సీమ రేగు పండ్లను మాయం చేశాడు. చక్రాలు తప్పించి బండి మిగిలిన భాగాలను చెట్టుగా మార్చటానికి అతడు ఉపయోగించాడు.



ఏం జరిగిందో రైతు ఉ కి కూడా అర్ధమయ్యింది. చుట్టూ గుమిగూడిన మనుషులను తోసుకుంటూ అతడు సాధువు వెళ్లిన దారిలో పరిగెత్తుతూ, అరుస్తూ ఉన్నాడు, “ఆ ముసలి బిచ్చగాడిని పట్టుకోండి. అతడు నా సీమ రేగు పండ్లు దొంగిలించాడు.”

కానీ, ఆపాటికే సాధువు కొండల వైపుకి చాలా దూరం వెళ్లి పోయాడు. రైతు ఉ వెనకాల ఉన్న మనుషులు నిలబడలేనంతగా, పొట్ట చెక్కలయ్యేలా పడీ పడీ నవ్వారు.



అప్పటి నుంచి, సీమ రేగు పండ్లు పోగొట్టుకున్న రైతు కథని తమ పిల్లలకు చెప్పి, "ఆ పిసినారి రైతు లాగా మూర్ఖంగా ప్రవర్తించి నవ్వులపాలు కావద్దు," అని అంటుంటారు.

ఆ రోజు నుంచి ఆకాశంలో ఎగిరే పిట్టలను చూసి బుట్టలు అల్లేవాడి కొడుకు ఎంతో ఆనందించేవాడు. ఆ తరవాత అతడు ఒక్క పిట్టను కూడా బంధించ లేదు. కరువు రోజులలో కూడా లియాంగ్ బావి ఎప్పుడూ తియ్యటి నీళ్లతో నిండుగా ఉండేది.

ఫు నాన్ కి సాధువు ఇచ్చిన కాగితం ముక్క ఒక పెద్ద, అందమైన గాలిపటంగా మారిపోయింది. ఆగస్టు నెల పౌర్ణమి పండగ నాడు ఆ గాలిపటాన్ని అతడు మొదటిసారి ఎగరవేసినప్పుడు అంతటి అందమైన, చక్కని గాలిపటం అంతకు మునుపెన్నడూ తన వద్ద లేదని ఫు నాన్ కి అర్థమయ్యింది. గాలి కదలికలు లేని ఆకాశంలో ఉన్నట్టుండి ఒక రివ్వ మొదలయ్యి గాలిపటాన్ని పైపైకి తీసుకుని వెళ్లింది. గాలికి రెపరెప లాడుతున్న గాలిపటం తోకను చూస్తుంటే ఆ సాధువు తన దగ్గరలోనే ఉన్నాడని ఫు నాన్ కి అనిపించేది. ఏదో ఒక రోజు ఊరు వదిలి పెట్టి కొండలలోని ఆ సాధువుని వెతుక్కుంటూ వెళతాడని అతడికి తెలుసు.



అయిపోయింది